ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★ శుక్రవారం 12 జూలై 2024

సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు చేయాలి 8లో..

విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చర్యలు : కలెక్టర్ 8లో..

అనుమానాలకు తెర..!

- ఉచిత చేప పిల్లల పంపిణీకి టెండర్లు
- జిల్లాలో కోటి 58 లక్షల చేప పిల్లల లక్ష్యం
- ఈనెలాఖరు వరకు పూర్తికానున్న టెండర్లు
- వచ్చే నెలలో పంపిణీకి శ్రీకారం



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీపై నెలకొన్న అనుమానాలు పటాపంచలయ్యాయి. చేప పిల్లల పంపిణీకి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించడంతో మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో గల చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేప పిల్లలు పోసేందుకు ఈనెల 8న ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించింది. ఈనెల 23వ తేదీ వరకు టెండర్లను స్వీకరించనున్నారు. ఆ తర్వాత టెండర్లు దాఖలు చేసిన కాంట్రాక్టర్లకు ఏ మేరకు అర్హతలున్నాయో సాంకేతిక కమిటీ పరిశీలించిన తర్వాత తక్కువ ధర కోట్ చేసే కాంట్రాక్టర్లకు చేప పిల్లలు పంపిణీ చేసే టెండర్లను కట్టబెట్టనున్నారు. టెండర్ల ప్రక్రియ ఈనెలాఖరు వరకు పూర్తయితే ఆగస్టు నెల రెండో వారం నుంచి మత్స్యకారులకు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్లు తెలుస్తున్నది. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తర్వాత తొలిసారిగా అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, రిజర్వాయర్లలో చేప పిల్లలు పెంచి మత్స్య సంపదను గతంలోకంటే రెట్టింపు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు 2015 నుంచి మత్స్యకారులకు ఉచితంగా ప్రభుత్వం చేప పిల్లలను పంపిణీ చేయడం ప్రారంభించింది. గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు సాధించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తారా, లేదా అనే అనుమానాలు మత్స్యకారుల్లో నెలకొన్నాయి. ఇటీవల ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించి మత్స్యకారుల్లో నెలకొన్న అనుమానాలను పటాపంచలు చేసింది.

చేప పిల్లల పంపిణీ టెండర్లు ఆహ్వానించాం..

భాస్కర్, జిల్లా మత్స్య శాఖాధికారి, పెద్దపల్లి



జిల్లాలో గల చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేపలు పెంచి మత్స్యకారులు ఉపాధి పొందేందుకు ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేసేందుకు ఈనెల 8న టెండర్లను ఆహ్వానించాం. 23 వరకు గడువు విధించాం. అనంతరం సాంకేతిక కమిటీ పరిశీలించిన తర్వాత ఫైనల్ చేస్తాం. వర్షాలు పడి నీటి వనరులు నిండిన తర్వాత మత్స్యకారులకు చేప పిల్లలను పంపిణీ చేస్తాం.

201 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు..

జిల్లాలో 201 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, ఇందులో 14,900 మంది మత్స్యకారులు సభ్యులుగా ఉన్నారు. 1073 చెరువులు, కుంటలు, శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌తో పాటు సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు ఉన్నాయి. వీటిలో చేపలు పెంచుకుని ఉపాధి పొందేందుకు ప్రభుత్వం చెరువులు, కుంటు, రిజర్వాయర్లను మత్స్యకారులకు ప్రతి ఏటా లీజుకు ఇవ్వడంతో పాటు ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్నది. జిల్లాలో ఉన్న చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, బ్యారేజీల్లో పోసేందుకు కోటి 58 లక్షల చేప పిల్లలు అవసరం అవుతాయని జిల్లా మత్స్య శాఖ అంచనాలు తయారు చేసింది. 1061 చెరువుల్లో 35 నుంచి 40 ఎంఎం సైజు గల చేప పిల్లలు కోటి 2 లక్షల 2 వేల చేప పిల్లలు, 12 చెరువులు, 3 రిజర్వాయర్లలో 80 నుంచి 100 ఎంఎం సైజు గల చేప పిల్లలు, 56 లక్షలు అవసరం ఉంటాయని అంచనా వేశారు.

శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో 12 లక్షల 21 వేల చేప పిల్లలు, అన్నారం బ్యారేజీలో 8 లక్షల 79 వేలు, సుందిళ్ల బ్యారేజీలో 11 లక్షల 41 వేలు, ఇతర 12 పెద్ద చెరువుల్లో 26 లక్షల 19 వేల చేపపిల్లలు పోయనున్నారు. ప్రస్తుతం జిల్లాలో సాధారణ వర్షపాతం మాత్రమే నమోదయ్యింది. భారీ వర్షాలు ఇంకా పడలేదు. దీంతో చెరువులు, కుంటలు, రిజర్వాయర్లలో చేపల పెంపకానికి సరిపడా నీళ్లు లేవు. భారీ వర్షాలు పడితే గానీ నీటి వనరులు నిండే పరిస్థితి లేదు. వర్షాలు పడేలోపు టెండర్లు పూర్తి కానున్నాయి. ఆగస్టులో రెండో వారంలో చేప పిల్లలు పంపిణీ చేసే అవకాశాలున్నాయి.



రైతులకు అందుబాటులో ఎరువులు

ఎలిగేడు, జూలై 11 : ప్రస్తుత వ్యవసాయ సీజన్‌కు సరిపోయే ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి ఉమాపతి తెలిపారు. మండలంలోని సుల్తాన్‌పూర్, ధూళికట్ట, ఎలిగేడు గ్రామాల్లోని పలు ఎరువుల షాపులతో పాటు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘ గోదాంల్లో ఉన్న ఎరువుల స్టాక్ వివరాలు తెలుసుకొని పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎరువుల డీలర్లు కేశెట్టి రఘవేంద్ర, కేశెట్టి నాగభూషణం, ఎల్లెంకి రాజేశం, సీఈవో విక్రమ్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేగడిమద్దికుంట, అల్లీపూర్‌లో విజృంభిస్తున్న జ్వరాలు

- సుల్తానాబాద్ ఆస్పత్రిలో పలువురి చేరిక

సుల్తానాబాద్, జూలై 11: సుల్తానాబాద్ మండలంలోని రేగడిమద్దికుంట, ఆల్లీపూర్ గ్రామాలలో వైరల్ జ్వరాలు విజృంభించాయి. ఈ రెండు గ్రామాలలో ప్రజలు జ్వరాలతో మంచం పట్టారు. జ్వరాలతో బాదపడుతున్న వారు గురువారం పెద్ద సంఖ్యలో సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరారు. దాదాపు 20 మంది వరకు ఆస్పత్రికి వచ్చారు. ప్రస్తుతం సుల్తానాబాద్ ఆస్పత్రిలో జ్వరాలతో బాధపడుతున్న వారితో ఆస్పత్రి బెడ్లు నిండిపోయాయి. కాగా, గురువారం రాత్రి గంటన్నర పాటు ఆస్పత్రిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌కు లాభాల పంట

- 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.440.96కోట్ల లాభాలు

- లాభాల నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి రూ.35కోట్ల డివిడెండ్ - ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.650కోట్ల అంచనా

కోల్‌సిటీ, జూలై 11: ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా నిర్మించిన రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(ఆర్ఎఫ్‌సీఎల్)కు లాభల పంట పండుతోంది.2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.4,941.6 కోట్ల టర్నోవర్‌తో రూ.440.96కోట్ల లాభాలు రాగా, పన్నులు పోను రూ.328.13కోట్లు నికర లాభాలను ఆర్జించింది. ఇందులో నుంచి భాగస్వామి అయిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి రూ.35కోట్లు డివిడెండ్‌గా చెల్లించింది. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్ఎఫ్ సీఎల్‌లో 11శాతం వాటా ఉంది. ఈక్విటీగా రూ.250కోట్లు పెట్టుబడి పెట్టగా ఒక సంవత్సరంలోనే 35కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి లాభాలుగా వచ్చాయి. రోజుకు 3850 టన్నుల యూరియా ఉత్పత్తి సమర్థ్యం గల ఈ పరిశ్రమ నుంచి గత ఏడాది 11.3లక్షల టన్నుల యూరియా వివిధ రాష్ట్రాలకు సరఫరా జరిగింది. తెలంగాణకే సగం యూరియా సరఫరా చేశారు.

నైపుణ్యం చాటుకొని..

ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థ ఉత్పత్తి ప్రారంభించిన మొదట్లో సాంకేతిక ఇబ్బందులతో సతమతమయ్యింది. యంత్రాంగం సమష్టి కృషితో అవరోధాలను అధిగమించింది. మొదట గ్యాస్ వినియోగం ఎక్కువగా అయ్యేది. హీట్ ఎక్స్ఛేంజర్స్‌ను మార్చడంతో 5.1గిగా క్యాలరీ వరకు గ్యాస్ వినియోగం తగ్గింది. దీనికి తోడు అంతర్జాతీయ మార్కెట్‌లో గ్యాస్ ధరలు తగ్గడం, పునరుద్ధరణ జరిగిన ఎరువుల కర్మాగారాలకు న్యూ ఇండస్ట్రియల్ పాలసీ (ఎన్ఐపీ)ని 2029 వరకుపొడగించడంతో ఆర్ఎఫ్‌సీఎల్‌కు అవకాశం అందివచ్చింది. ముఖ్యంగా రైతుల నుంచి పీఓఎస్ చేయడంలో ప్రధాన దృష్టి పెట్టారు. గత ఆర్థిక సంవత్సరంలో పీవోఎస్ ద్వారా రూ.3283కోట్ల వనరులు సమకూరాయి. హెచ్‌యూఆర్ఎల్ తరువాత దేశంలోని ఎరువుల కర్మాగరం తరువాత అత్యధిక లాభాలు ఆర్జిస్తున్న సంస్థగా ఆర్ఎఫ్‌సీఎల్ రికార్డుల్లోకి ఎక్కింది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో భాగస్వామి అయిన నేషనల్ ఫర్టిలైజర్స్ కెమికల్స్ లిమిటెడ్‌కు తన వాటాగా రూ.85కోట్లు ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి డివిడెంట్ ఇచ్చింది. ఎన్ఎఫ్ఎల్‌కు పలు ఎరువుల కర్మాగారాలు ఉండగా మొత్తంగా గత ఆర్థిక సంవత్సరం రూ.150కోట్ల లాభాలు ఆర్జించింది. అందులో రూ.85కోట్లు ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి లభించాయి.



ఆర్ఎఫ్‌సీఎల్ ప్రాజెక్టు

ఈ ఏడాది రూ.650కోట్లు లాభాల లక్ష్యం...

ఆర్ఎఫ్‌సీఎల్ సంస్థ ఈ ఆర్థిక సంవత్సరం రూ.650కోట్లు లాభాలు ఆర్జించడమే లక్ష్యంగా పెట్టుకున్నది. ఈ ఆర్థిక సంవత్సరం హెచ్‌టీఆర్‌ను మార్చడం ద్వారా గ్యాస్ వినియోగంలో మరింత సమర్థవంతంగా పని చేయడం ద్వారా లాభాలను ఆర్జించాలని నిర్ణయించారు. ఆర్ఎఫ్‌సీఎల్ ఉత్పత్తి వ్యయంలో గ్యాస్ చార్జీలే అధికంగా ఉంటాయి. గ్యాస్ వినియోగం తగ్గితే లాభాలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఈ ఆర్థిక సంవత్సరం 12లక్షల టన్నులకుపైగా ఉత్పత్తి సాధించి రాష్ట్ర రైతాంగానికి 6లక్షల టన్నుల యూరియా సరఫరా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటాం

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, జూలై 11: ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని, ఐదేళ్లలో ఊహించని అభివృద్ధి చేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ విలీన గ్రామమైన పూసాలలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.42 లక్షలతో నిర్మించిన నాలుగు తరగతి గదులను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ఎన్నికల్లో ఇచ్చిన మాటలకు కట్టుబడి ఉంటామని, పత్తిపాక రిజర్వాయర్ నిర్మాణం పూర్తిచేయడంతో పాటు పెద్దపల్లి, సుల్తానాబాద్ పట్టణాల్లో ఎవరూ ఊహించని విధంగా అభివృద్ధి పరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లు, వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమతక్రిష్ణ, కేడీసీసీబీ డైరెక్టర్ శ్రీగిరి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పన్నాల రాములు, సిద్ధ తిరుపతి, మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, తహసీల్దార్ మధుసుధన్‌రెడ్డి, డీఈ మధుమతి, హెచ్ఎం సుజాత, తానిపర్తి తిరుపతిరావు, సుభాషిణి తదితరు లు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జిల్లా అదనపు న్యాయమూర్తి టీ శ్రీనివాసరావు

కోల్‌సిటీ, జూలై 11: నూతన చట్టాలపై న్యాయవాదులకు అవగాహన కలిగి ఉండాలని అదనపు జిల్లా న్యాయమూర్తి టీ శ్రీనివాసరావు అన్నారు. హైకోర్టు న్యాయమూర్తి రాపోలు భాస్కర్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం న్యాయవాదులకు నూతన చట్టాలపై రూపొందించిన పుస్తకాలను గురువారం బార్ అసోసియేషన్ న్యాయవాదులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర్చుకున్న విద్యను ప్రతి ఒక్కరికి పంచాలని, కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన నూతన చట్టాలపై ప్రతి న్యాయవాది అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం న్యాయవాదులకు ఉచితంగా పుస్తకాలను అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తౌటం సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సబ్‌జడ్జి శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి మంజుల, రెండవ అదనపు న్యాయమూర్తి వెంకటేష్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్, సభ్యులు గోషిక ప్రకాష్, ప్రవీణ్, మహేందర్, సంతోష్, వరలక్ష్మి, రమ్య, దూడపాక లింగయ్య, మహేందర్, సంతోష్ పాల్గొన్నారు.



పుస్తకాలు అందజేస్తున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పీఎం షేక్



సమావేశంలో మాట్లాడుతున్న పీఎం షేక్

కాల్వశ్రీరాంపూర్, జూలై 11: ప్రభుత్వ పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పీఎం షేక్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను కోరారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో జరిగిన ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా పీఎం షేక్ మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి, సమన్వయంతో పని చేస్తూ ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి కార్యక్రమాలను పగడ్బందీగా అమలుచేయాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అవసరమైతే వారికి ప్రత్యేక తరగతులను నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారని, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ జిల్లాను అగ్రభాగాన నిలపాలని కోరారు. ఎఫ్ఎల్ఎన్ మండల నోడల్ అధికారి సిరిమల్ల మహేష్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సునీత, సత్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి, ఎన్టీపీసీ కింద చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ పూర్తిచేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో సింగరేణి జీఎంలు, ఎన్టీపీసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీపీసీ, టీఎస్‌టీపీపీ స్టేజ్ 2 యాష్ డైక్ నిర్మాణం కోసం అంతర్గాం మండలం మొగల్ పహడ్ గ్రామం వద్ద అవసరమైన 606ఎకరాల భూసేకరణ కోసం ప్రిలిమినరీ ఎంజాయ్‌మెంట్ సర్వేపూర్తి చేసి, నోటిఫికేషన్ విడుదల చేయాలని సూచించారు. టీఎస్‌టీపీపీ స్టేజ్ 2 పైప్‌లైన్ కారిడార్ ఏర్పాటు కోసం రామగుండం మండలం మల్యాలపల్లి గ్రామం, అంతర్గాం మండలం కుందనపల్లి గ్రామంలో 45ఎకరాల భూసేకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎన్టీపీసీ సంస్థ సేకరించిన 9543 ఎకరాల 10గుంటల భూముల మ్యూటేషన్ ప్రక్రియ పూర్తిచేసి ధరణి పోర్టల్‌లో రికార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. సింగరేణి ఆర్జీ 1, 2, 3 పరిధిలోని పెండింగ్ భూసేకరణకు సంబంధించి సర్వే ప్రక్రియ పూర్తిచేయాలని ఆదేశించారు. ఆర్జీ1 పరిధిలో ముంపు గ్రామమైన సింగిరెడ్డిపల్లి ఆర్ అండ్ఆర్ ప్రక్రియ పూర్తి అవుతున్న నేపథ్యంలో అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అదే విధంగా ఆర్జీ 3 పరిధిలో ఉన్న బుధవారంపేట, రత్నాపూర్, అక్కెపల్లి, లద్నాపూర్ భూసేకరణ, ఆర్అండ్ఆర్ స్థితిగతులపై సమీక్షించి పలు సూచనలు చేశారు. సమావేశంలో మంథని ఆర్డీవో హనుమానాయక్, సర్వేఅండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్, సింగరేణి, ఎన్టీపీసీ, రెవెన్యూ, తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు



ఉచిత వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ హిమాబిందు

కమాన్‌పూర్, జూలై 11 : గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని రామగుండం సింగరేణి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ప్రభుత్వపరంగా సేవ చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉందన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో అన్ని వసతులు ఉన్నాయని తెలిపారు. మాతా శిశులాంటి వైద్య సేవలు సైతం పేదవారికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం రోగులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ అప్పారావు, మండల ప్రత్యేకాధికారి ఆదిరెడ్డి, మండల తహసీల్దార్ అరిపోద్దీన్, సింగిల్‌విండో చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు, ఇన్‌చార్జీ ఎంపీడీవో శేషయ్య సూరి, మాజీ ఎంపీటీసీ బోనాల వెంకటస్వామి, మాజీ సర్పంచ్ నీలం సరిత శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

డీజీపీ జితేందర్‌ను కలిసిన జనక్‌ప్రసాద్

గోదావరిఖని, జూలై 11: తెలంగాణ రాష్ట్ర డీజీపీగా పదవీ బాధ్యతలు చేపట్టిన జితేందర్‌ను గురువారం రాష్ట్ర మినిమం వేజెస్ బోర్డ్ చైర్మన్ జనక్‌ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు.

24 గంటలు వైద్య సేవలందించాలి

పాలకుర్తి, జూలై 11: మండలం పరిధిలోని పుట్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24గంటలు వైద్యం అందించా లని కోరుతూ పుట్నూర్ గ్రామ యువకులు గురువారం కలెక్టర్ వినతిపత్రం అందించారు. స్పందించిన ఆయన ప్రజలకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య నరేష్, తోట ప్రశాంత్, అంజి తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చర్యలు

- మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి

మెట్‌పల్లి రూరల్, జూలై 11: గ్రామాల్లో ఎవరైనా గుడుంబా తయారు చేసినా, విక్రయించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి, ఎక్సైజ్ సీఐ వినోద్‌రాథోడులు హెచ్చరించారు. గురువారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని అల్లూరిసీతారామాతండా, ఆత్మనగర్ తండాలో తయారు చేస్తున్న గుడుంబా స్థావరాలపై పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. గుడుంబా తయారు చేస్తున్న సంతోష్‌నాయక్, గంగాధర్‌నాయక్‌లను పట్టుకొని వారి నుంచి 10లీటర్ల గుడుంబా పారాబోశారు. 500 లీటర్ల పానకం, ముడి సరుకులను ధ్వంసం చేశారు. అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. ఇకపై గ్రామంలో ఎవరైనా నాటు సారా తయారీ చేసిన, తయారీకి ముడి సరకు సరఫరా చేసిన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా నాటుసారా తయారీకి కావాల్సిన వస్తువులు కొనుగోళ్లపై దృష్టి సారిస్తామన్నారు. దాడుల్లో పోలీసు, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.


ఏఎస్ఆర్‌తండాలో గుడుంబాను పట్టుకున్న పోలీసులు, ఎక్సైజ్ అధికారులు

కోరపల్లి రోడ్డులో తనిఖీలు

జమ్మికుంట: జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కోరపల్లి రోడ్డులో గల పలు ఇళ్లలో అబ్కారీ ఎస్ఐ సౌమ్య ఆధ్వర్యంలో గురువారం తనిఖీలు చేపట్టారు. గుడుంబా విక్రయాలు ఏమైనా జరుపుతున్నారా అనే కోణంలో కుండలు, బకెట్లు, పాత్రలు, డ్రమ్ములను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో గుడుంబ విక్రయాలు జరుగడం లేదని, ముందస్తు జాగ్రత్తలో భాగంగా తనిఖీలు జరిపినట్లు తెలిపారు. బెల్ట్ షాపుల్లో మద్యం విక్రయాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆమె వెంట అబ్కారీ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వాచ్‌మన్ నుంచి లెక్చరర్ స్థాయికి...


విజయ సంకేతం చూపుతున్న రాజ్‌కుమార్

బెల్లంపల్లి, జూలై 11: వాచ్‌మన్‌గా పనిచేసి జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించాడు కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం అన్నారం గ్రామానికి చెందిన కొమురయ్య-పుష్పలత దంపతుల కుమారుడు రాజ్‌కుమార్. రాజ్‌కుమార్ తండ్రి పంచాయతీరాజ్ శాఖలో అటెండర్‌గా విధులు నిర్వహించేవాడు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండేది. తండ్రి మరణం తర్వాత కుటుంబానికి ఇబ్బందులు మరింత ఎక్కువయ్యాయి. రాజ్‌కుమార్ డిప్లొమాతోనే చదువు మానేసి పది సంవత్సరాల పాటు కరీంనగర్ జిల్లా పరిషత్ కార్యాలయంలో నైట్ వాచ్‌మన్‌గా విధులు నిర్వహించాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు చదువుకోవాలని సూచించడంతో మళ్లీ చదువుబాట పట్టాడు. కాకతీయ విశ్వవిద్యాలయంలో ఓపెన్ డిగ్రీతోపాటు పీజీ పూర్తి చేశాడు. టెట్ రెండు సార్లు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించాడు. 2017లో నిర్వహించిన ప్రభుత్వ గురుకుల పరీక్షలో టీజీటీ, పీజీటీ ఉద్యోగాల్లో ర్యాంకు సాధించి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పీజీటీ తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల విడుదలైన జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో తెలుగు సబ్జెక్టులో రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు, మల్టీజోన్ 1లో మూడో ర్యాంకు సాధించాడు. దీంతో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యాడు. స్నేహితులు, కుటుంబీకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఆరుబయటే పాఠాలు

- సరిపడా తరగతి గదులు లేక విద్యార్థుల ఇక్కట్లు
- వానాకాలంలో మరింత ఇబ్బందులు

మెట్‌పల్లి రూరల్, జూలై 11: గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు మెరుగైన బోధన అందించి వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ ఆశయం నెరవేరడం లేదు. ఉపాధ్యాయులు, తరగతి గదులున్న చోట విద్యార్థులు లేకపోవడం, టీచర్లు ఉన్న పాఠశాలలకు పిల్లలు రాకపోవడంతో పాఠశాలల భవిష్యత్ అగమ్యగోచరంగా మారింది. మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రభుత్వ ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో తరగతి గదుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. గదుల కొరతతో ఆరుబయట ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై గదుల కొరత ప్రభావం తీవ్రంగా పడుతోంది. నిబంధనల ప్రకారం తరగతికి ఒక గది ఉండాలి. చాలా చోట్ల తరగతులకు సరిపడా గదులు లేవు. ముఖ్యంగా వానాకాలం ఈ సమస్య మరింతగా వేధిస్తోంది. వర్షాలు కురిసిన సమయంలో ఒకే తరగతి గదుల్లో విద్యార్థులను ఇరుకుగా కూర్చోబెడుతున్నారు. భౌతిక దూరం పాటించాలనే నిబంధన అమలు కావడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో బడి బాట కార్యక్రమాన్ని చేపట్టి చిన్నారులు, యువతను ఉత్తమ విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తున్నామని చెపుతున్న ప్రభుత్వం అందుకు విరుద్ధంగా పాఠశాలలోని సమస్యలు వెక్కిరిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలను మోడల్‌గా తయారు చేయాలని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలనలో మన ఊరు మన బడి కింద పాఠశాలల అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టి నిధులు మంజూరు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలోని ఎంపిక చేసి విద్యుదీకరణ, తాగునీరు, మూత్రశాలల మరమ్మతులు పూర్తిస్థాయిలో చేపట్టలేదు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి ప్రహరీ, కిచెన్ షెడ్స్ నిర్మాణాలను చేపట్టారు. చేసిన పనులకు గత ప్రభుత్వం మొదట్లో నిధులు ఇచ్చింది. అసెంబ్లీ ఎన్నికలకు ఆరు నెలలకు ముందు నుంచి తరగతి గదుల నిర్మాణాలకు నిధులు విడుదల చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.



రాజేశ్వర్‌రావుపేటలో ఆరుబయట పాఠాలు వింటున్న విద్యార్థులు

● విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బందులు...

గ్రామాల్లో మన ఊరు మన బడి కార్యక్రమాన్ని చేపట్టి పాఠశాలలో విద్యార్థులను ఉపాధ్యాయులు చేర్చుకున్నారు. కానీ పాఠశాలలో తరగతి గదల కొరతతో విద్యా బోధన ఆరుబయట చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వానాకాలంలో విద్యాబోధన చేయడానికి ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రాజేశ్వర్‌రావుపేట, బండలింగాపూర్, రామలచ్చక్కపేట, కోనరావుపేట, జగ్గసాగర్ గ్రామాలతో పాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల కొరత ఉండడం వలన విద్యార్థులకు ఆరుబయట ఉపాధ్యాయులు బోధన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. పలు గ్రామాల్లోని పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉన్నాయి. ప్రతీ సంవత్సరం విద్యార్థుల సంఖ్య పెరుగుతున్నా తగినంత గదులు లేకపోవడంతో బోధన ఇబ్బందిగా కొనసాగుతోంది. పేద విద్యార్థులకు మంచి విద్య అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలో ఇంగ్లీషు మీడియంలో విద్యనందించాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నది. ముఖ్యంగా పాఠశాలలో సరైన తరగతి గదులు, సరైన వసతులు అందుబాటులో లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరగతి గదుల కొరత విషయాన్ని గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీ సుకెళ్లినట్లు గ్రామాల్లోని మాజీ ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని నాయకులు కోరుతున్నారు.

● ప్రభుత్వానికి నివేదిస్తున్నాం..

- భీమయ్య, ఇన్‌చార్జి ఎంఈవో, మెట్‌పల్లి

మండంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. కొన్ని గ్రామాల్లోని పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం చేశాము. మన ఊరు మన బడి కార్యక్రమం కింద చేపట్టిన పనులకు నిధులు నిలిచిపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. దీంతో గదుల కొరత, పలు సమస్యలు అలాగే ఉన్నాయి. అమ్మ ఆదర్శ పథకంలో భాగంగా పాఠశాలలోని సమస్యలను పరిష్కారం అవుతున్నాయి.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి



తిరుమల శ్రీవారి ఆలయంలో బండి సంజయ్‌కుమార్, కుటుంబసభ్యులు

భగత్‌నగర్, జూలై 11: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ గురువారం తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం, తన పుట్టినరోజును పురస్కరించుకుని గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శనం చేసుకున్నారు.

తిరుపతిలో టీటీడీ అధికారులు ఆలయ మర్యాదలతో బండి సంజయ్‌కు స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదపండితులు బండి సంజయ్ కుటుంబసభ్యులకు ఆశీర్వచనం అందజేశారు.

వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్న నెమళ్లు

- ఇళ్ల మధ్య నెమలి మృతదేహం లభ్యం

గన్నేరువరం, జులై 11: మండలంలోని మైలారం గ్రామంలో జాతీయ పక్షులైన నెమల్లకు రక్షణ కరువైంది. మానేరు డ్యాం శివారులో ఉన్న మైలారం గ్రామం గుట్టల ప్రాంతం కావడంతో అక్కడ నెమల్లు, అడవిపందులు, కుందేళ్ళు, ఎలుగుబంట్లు ఉండడంతో వాటిని వేటగాళ్ళు వేటాడి చంపి వాటి మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు గ్రామంలో వెల్లువెత్తున్నాయి. గురువారం గ్రామంలోని జనావాసాల సమీపంలో నెమలి మృతదేహం, ఈకలు కనిపించాయి. వేటగాళ్ళు నెమలిని వేటాడి చంపి మాంసంగా మార్చే ప్రయత్నంలో ఏమరపాటు మూలంగా వీధి కుక్కలు నెమలి మృతదేహాన్ని లాక్కెళ్ళి తిన్నదని విశ్వసనీయ సమాచారం. గత కొంతకాలంగా ఈ నెమల్ల వేట యధేచ్ఛగా కొనసాగుతుందని, వన్యప్రాణుల మాంసాన్ని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు వన్యప్రాణుల వేటపై దృష్టి సారించక పోవడం మూలంగా ఏకంగా జాతీయ పక్షి నెమల్లను సైతం వేటగాళ్ళు వదలటం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి నెమలుల వేటపై విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

● ఫారెస్ట్ అధికారుల పరిశీలన..

మైలారంలో నెమళ్ల వేట విషయం తెలుసుకున్న ఫారెస్ట్ అధికారులు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నర్సింగరావు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శేఖర్ సాయంత్రం మైలారం గ్రామానికి చేరుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నెమలి మృతదేహం వద్ద పరిశీలించగా వారికి నెమలి ఈకలు లభించగా నెమలి కళేబరం కనబడలేదు. రాత్రి కావడంతో నెమలి మృతదేహాన్ని వెతకడం సాధ్యం కాలేదని తెలిపారు. శుక్రవారం తిరిగి సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని కనుగొని పంచనామా నిర్వహించి, గ్రామంలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.

చెరువు తూములు తెరిపించాలని ఆందోళన

మల్యాల, జూలై 11: మల్యాలలోని సూరప్ప చెరువు తూములను మూసివేయడంతో పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చి తూములు తెరిపించాలని కోరుతూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. సూరప్ప చెరువులో తమకు పట్టా భూములు ఉన్నాయని వానాకాలంలో ఆ భూములు నీటిలో మునిగిపోతుండగా కొన్నేళ్లుగా యాసంగి పంట మాత్రమే చేసుకుంటున్నామని అయితే మూడేళ్లుగా చెరువు తూములు తెరవకపోవడంతో నీరు అందులోనే ఉండి పంటలు చేసుకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తూములు మూసి ఉండడంతో చెరువులో గల భూములు సాగు కాకపోగ, తూములు తెరువక నీళ్ల రాక చెరువు కింది భూములలో పంటలు సాగు చేయక నష్టపోవాల్సి వస్తుందని తహసీల్దార్‌తో పేర్కొన్నారు. తూములు తెరిపించి తమను ఆదుకోవాలని కోరారు. అనంతరం ఇరిగేషన్ అధికారులకు కూడా కలిసి తమ ఆవేదన తెలిపారు. కార్యక్రమంలో రైతులు బావు శంకర్, తాటిపాముల జగదీశ్వర్, జక్కుల రాయమల్లు, సంగ సత్యనారాయణ, బావు నాగభూషనం, గడ్డి లచ్చన్న, సంతోష్ తదితరులు అధికారులను కలిసిన వారిలో ఉన్నారు.

సాంకేతికలోపంతో నిలిచిన రిజిస్ట్రేషన్లు

కరీంనగర్ క్రైం, జూలై 11: స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ సర్వర్‌డౌన్‌తో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గురువారం ఆస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. క్రయవిక్రయదారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు వేచి చూసి విసిగిపోయి వెళ్లిపోయారు. గురువారం రోజు వివిధ రకాల రిజిస్ట్రేషన్ల కోసం దాదాపు 50 వరకు డాక్యుమెంట్లు సిద్ధం చేసుకుని కార్యాలయానికి వచ్చిన విక్రయదారులు కార్యాలయంలో సాంకేతికలోపం తలెత్తిందని అధికారులు చెప్పటంతో రోజంతా కార్యాలయం లోపల, బయట వేచి ఉన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఆధార్‌లింకప్ కాకుండా మొరాయించటంతో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయయని అధికారులు తెలిపారు. ఈకేవైసీ పూర్తి చేస్తేనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అవుతుంది. దీంతో సబ్‌రిజిస్ట్రార్‌లు కూడా కార్యాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి చూశారు. సాంకేతిక సమస్య పరిష్కారం అయితే ఏ సమయంలో అయినా రిజిస్ట్రేషన్లు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. గురువారం రోజు స్లాట్‌ను శుక్రవారానికి అనుమతి ఇస్తామని తెలిపారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని 14 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఇదే సమస్యతో రిజిస్ట్రేషన్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ముగ్గురికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, జూలై 11: మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తనిఖీలలో పట్టుబడిన ముగ్గురు వాహనదారులకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ గురువారం తీర్పు వెలువరించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీం ఉల్లాఖాన్ తెలిపారు. డ్రవంకెన్ డ్రైవ్ కేసులో 23 మంది వాహనదారులను కోర్టులో హాజరుపరచగా ఇందులో ముగ్గురు వ్యక్తులకు 3 రోజుల జైలుశిక్ష లేదా మొత్తం ఏడు వేల జరిమానా చెల్లించాలని తీర్పు ఇచ్చారని సీఐ తెలిపారు. మిగతా 20 మంది వాహనదారులకు 35,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు.

ఇద్దరు యువకుల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, జూలై 11 : సిరిసిల్ల పట్టణంలోని బైపాస్ రోడ్డు, జూనియర్ కళాశాల వద్ద ద్విచక్రవాహనాలపై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్న ఇద్దరు యువకులను అరెస్ట్ చేసినట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. గురువారం సాయంత్రం సిరిసిల్ల పట్టణంలో ద్విచక్రవాహనాలపై ప్రమాదకర విన్యాసాలు చేస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు చేసి సుందరయ్యనగర్‌కు చెందిన బూరాని గణేష్‌సింగ్, భోగ రాజు అనే ఇద్దరు యువకులను పట్టుకొని ద్విచక్రవాహనాలను సీజ్ చేశారని అన్నారు. యువకులపై నూతన చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేటి నుంచి 'గృహజ్యోతి' ఎడిట్ ఆప్షన్

గణేశ్‌నగర్, జూలై 11: గృహజ్యోతి పథకానికి అర్హులై ఉండి వివరాల నమోదులో తప్పులు దొర్లిన వారికి శుక్రవారం నుంచి ప్రభుత్వం ఎడిట్ ఆప్షన్లను ఇచ్చింది. నెలకు 200 యూనిట్లు వాడుతూ తెల్లరేషన్ కార్డు గల వారికి ఉచిత విద్యుత్ ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం గతంలో గృహజ్యోతికి దరఖాస్తు చేసుకుని విద్యుత్ యూఎస్‌సి/ఎస్‌సి నంబర్ తప్పుగాపడి జీరోబిల్ రాని వారు ఎంపీడీవో, మున్సిపల్ ఆఫీసుల్లో సరిచేసుకోవచ్చు. వినియోగదారులు అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారులు తెలిపారు.

అంతర్రాష్ట్ర గంజాయి ముఠా పట్టివేత

- 6.03 కిలోల గంజాయితో పాటు మూడు సెల్ ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జగిత్యాల ఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల టౌన్, జూలై 11: జగిత్యాల జిల్లా ధర్మపురి పోలీసులు అంతర్ రాష్ట్ర గంజాయి రాకెట్ ముఠాను పట్టుకున్నారు. వీరి వద్ద 6.03 కిలోల గంజాయితో పాటు మూడు సెల్ ఫోన్లు, రూ. 3,500 నగదును సీజ్ చేశారు. గురువారం జగిత్యాల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో దొంగల ముఠాను అరెస్టు చూపించి విలేకరుల సమావేశంలో ఎస్పీ అశోక్ కుమార్ వివరాలు వెల్లడించారు. జిల్లాలోని ధర్మపురి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల గంజాయి విక్రయిస్తూ రాయపట్నం గ్రామానికి చెందిన బత్తిని చందు, గొల్ల వెంకటేష్ పట్టుపడగా దొంతాపూర్ గ్రామానికి చెందిన దుర్గం రాము తప్పించుకుని పారిపోయాడు. బుధవారం ధర్మపురి మండలం బుద్దేష్‌పల్లి గ్రామంలో పోలీసుల కల్లుగప్పి తప్పించుక తిరుగుతున్న రాము ఉన్నాడనే సమాచారం అందింది. దీంతో ధర్మపురి ఎస్‌ఐ ఉదయ్ కుమార్ తన సిబ్బందితో బుద్దేష్‌పల్లికి వెళ్లి గాలించగా రాముతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. వీరి వద్ద 6.300 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో రాముతో పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తుల్లో ఒకరు ఒడిషా రాష్ట్రంలోని రాయగడ ప్రాంతానికి చెందిన దినేష్ కుమార్ నాయక్, మరొకరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయనగరానికి చెందిన గుజ్జల పురుషోత్తంగా గుర్తించారు. మరో ఇద్దరు పారిపోయినట్లు పోలీసులు గుర్తించారు. ఒడిషాకు చెందిన దినేష్‌కుమార్ నాయక్ గంజాయిని పండిస్తూ విజయనగరానికి చెందిన పురుషోత్తంకు సరఫరా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. అయితే ధర్మపురి మండలంలోని దొంతాపూర్‌కు చెందిన దుర్గం రాము ఇదే మండంలోని మగ్గిడి గ్రామానికి చెందిన అజయ్, సంజయ్‌కు ఒడిషాకు చెందిన దినేష్‌కుమార్ నాయక్, విజయనగరానికి చెందిన పురుషోత్తంతో రెండేళ్ల క్రితం పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి వీరంతా ఒక ముఠాగా ఏర్పడ్డారు. చందు, వెంకటేష్, రాము, అజయ్, సంజయ్ కలిసి ఒడిషా వెళ్లి అక్కడ రాయగడ రైల్వేస్టేషన్‌లో దినేష్ కుమార్ నాయక్, పురుషోత్తంలను కలుసుకుని గంజాయిని కొనుగోలు చేస్తూ ధర్మపురి ప్రాంతంలో విక్రయిస్తూ వ్యాపారాన్ని అభివృద్ధి చేయాలనే ప్లాన్ చేశారు. ధర్మపురి పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ధర్మపురి ప్రాంతానికి చెందిన వ్యక్తులతో పాటు ఇద్దరు అంతర్ రాష్ట దొంగలను పట్టుకుని వారి గుట్టురట్టు చేశారు. ఒడిషాకు చెందిన దినేష్ కుమార్ నాయక్‌కు గతంలో ఏపీ రాష్ట్రంలో జరిగిన ఎన్‌డీపీఎస్ చట్టంలో ప్రమేయం ఉండడంతో పాటు ఒడిషాలోని షేల్‌ఖాల్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదై రాయగడ జైలులో శిక్షను కూడా అనుభవించాడు.

ఏపీకి చెందిన పురుషోత్తం సైతం ఎన్‌డీపీఎస్ యాక్ట్ కేసులో రాయగడ జైలుకు వెళ్లగా వీరిద్దరికి అక్కడ పరిచయం ఏర్పడినట్లు ఎస్పీ వివరించారు. ఈ కేసులో గతంలో బత్తిని చందు, గొల్ల వెంకటేష్ పట్టుబడగా, తాజాగా రాము, దినేష్ కుమార్ నాయక్, పురుషోత్తం పట్టుబడగా అజయ్, సంజయ్ అనే ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు. జిల్లాలో అక్రమ గంజాయి సరఫరాపై ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాను గంజాయిరహిత జిల్లాగా మార్చడానికి స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతున్నామన్నారు. అంతర్రాష్ట్ర గంజాయి ముఠాను పట్టుకున్న డీఎస్పీ రఘుచందర్, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ధర్మపురి, గొల్లపల్లి ఎస్‌ఐలు ఉదయ్‌కుమార్, సతీష్, పోలీస్ సిబ్బంది రమేష్ నాయక్, పూర్ణ సాయి, రమేష్, రామస్వామి, అశోక్, సలీమోద్దీన్, వెంకటయ్య, నవీన్‌ను ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు.

స్త్రీనిధి సొమ్ము స్వాహాపై ఆందోళన

- చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల డిమాండ్

కరీంనగర్ రూరల్, జూలై 11: స్త్రీనిధి సొమ్ము స్వాహాపై చర్యలు తీసుకోవాలని గురువారం చామనపల్లి గ్రామైఖ్య సంఘాల మహిళలు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. లక్షలు గోల్‌మాల్ జరుగుతుండగా, క్షేత్రస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కరీంనగర్ రూరల్ మండలం చేగుర్తి గ్రామంలో 10కి పైగా మహిళా సంఘాలున్నాయని తెలిపారు. కరోనాకాలంలో సదరు సంఘాలకు స్త్రీ నిధి రుణాలు 35లక్షల రూపాయలు మంజూరయ్యాయి. వాటిని మహిళా సంఘాల ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా ఓ కోఆర్డినేటర్ కరోనా సమయంలో రుణం సమాచారం తెలుపకుండా మహిళల ఐడి కార్డులు, బ్యాంకు ఖాతాలను సేకరించి, గుట్టుగా సొమ్ము స్వాహా చేశారని తెలిపారు. రెండేళ్ల క్రితం అక్రమ బాగోతం వెలుగు చూడగా ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదని మహిళా సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆ డబ్బు వడ్డీతో కలిపి మొత్తం 40లక్షలకు చేరింది. మహిళలకు రుణాలు ఇవ్వకపోగా రేపు మాపంటూ తిప్పుకున్నారని అన్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని మహిళలు ఆరోపించారు. గతంలో కరీంనగర్ రూరల్ పోలీసులకు డీఆర్‌డీఏ అధికారులకు, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. న్యాయం కోసం ప్రతి రోజు పోలీస్‌స్టేషన్లు, అధికారుల కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నామని మహిళలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని శ్రీనిధి డబ్బులు, పొదుపు సంఘాల డబ్బులు ఇప్పించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో వీవో అధ్యక్షులు, గ్రామైఖ్య సంఘం మహిళలు గాలిపెల్లి కనుకలక్ష్మీ, నర్సమ్మ, రాజమ్మ, సరోజన, కనుకలక్ష్మి, సరోజన, ఈశ్వరమ్మ, అయిలమ్మ, విజయ, రమ, శారద, అరుణ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న చేగుర్తి మహిళ సంఘాల సభ్యులు

ఎస్సారెస్పీలోకి 1,794 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గురువారం వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 1,794 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది.

ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 12.44 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 17.243 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేది నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.573 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

రూ.7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, జూలై 11: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,550 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు ఎనిమిది మంది రైతులు 124 క్వింటాళ్ల విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,550 రూపాయలు, కనిష్ఠ ధర 7300 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

తెలంగాణ సంప్రదాయాలు దేశానికే ఆదర్శం

- గవర్నర్ సీపీ రాధాకృష్ణన్



గవర్నర్‌తో తాడిజెర్రి ఒగ్గుకళాకారుల బృందం

గంగాధర. జూలై 11: తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు దేశానికే ఆదర్శమని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అన్నారు. డిల్లీలో ఈనెల 9,10 తేదీల్లో లాల్ దర్వాజా శ్రీ సింహవాహిని మహంకాళి దేవస్థానం, తెలంగాణ భాష సంస్కృతి శాఖ ఆధ్వర్యంలో బోనాల జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా గంగాధర మండలం తాడిజెర్రికి చెందిన ఈర్ల మహిపాల్ ఒగ్గు కళాకారుల బృందం గేట్‌వే ఆఫ్ ఇండియా నుంచి తెలంగాణ భవన్ వరకు జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ఒగ్గు డోలు బృందాన్ని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడినట్లు ఈర్ల మహిపాల్ 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. తెలంగాణ కవులు, కళాకారుల ఆటపాటలు ప్రజలను ఉత్తేజాన్ని కలిగిస్తాయన్నారు. కళాకారులు, కవులు, సాహితీవేత్తలు తమ కళలతో తెలంగాణ ఘనతను చాటాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కళాబృందానికి మెమెంటోను అందించి సత్కరించారు. కార్యక్రమంలో కళాకారులు మహేందర్, గణేష్, రాము, గంగాశంకర్, అజయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెల మృతి

సిరిసిల్ల రూరల్, జూలై 11: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు గ్రామంలోని గొర్రెల మందపై గురువారం తెల్లవారుజామున కుక్కలు దాడి చేయడంతో దాదాపు 20 గొర్రెలు మృతిచెందాయి. గ్రామానికి చెందిన సిద్ది కనకయ్య యాదవ్ అనే గొర్రెల కాపరి తనకు ఉన్నా 40 గొర్రెలను గ్రామ శివారులోని తన ఇంటి వద్దనే ఏర్పాటు చేసిన షెడ్డులో ఉంచాడు. గురువారం తెల్లవారుజామున కుక్కలు గొర్రెల మందపై దాడి చేసి 20 గొర్రెలను చంపి వేయగా మరో 20 గొర్రెలను గాయపర్చాయి. గురువారం ఉదయం మంద వద్దకు వెళ్లిన కనకయ్య చనిపోయిన గొర్రెలను చూసి దు:ఖ సాగరంలో మునిగిపోయాడు. కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలతో రెండు లక్షల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవడంతో పాటు గ్రామంలోని కుక్కలను తరలించాలని గ్రామస్థులు కోరారు.

దొంగ సొత్తు కొంటే కఠిన చర్యలు

- 160మంది స్క్రాప్ వర్తకులకు కౌన్సెలింగ్
- 27మంది బైండోవర్

సిరిసిల్ల క్రైం, జూలై 11: దొంగ సొత్తుకొంటే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. రెండు రోజులుగా జిల్లావ్యాప్తంగా పలు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని స్క్రాప్ దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించిన సందర్భంగా గురువారం ఎస్పీ వివరాలు వెల్లడించారు. స్క్రాప్ వ్యాపారం మాటున అక్రమ దందా కొనసాగించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఇందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా 160మంది స్క్రాప్ వర్తకులకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. దీంతో 27మంది వర్తకులను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. షాపులో కొనుగోలు, అమ్మకాల్లో ప్రతి వస్తువుకు రిజిస్టర్‌లో నమోదుచేయాలన్నారు. తుక్కు, స్క్రాప్‌నకు తప్పకుండా రసీదులు ఇవ్వాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారం చేయకూడదని ఎస్పీ తెలిపారు.

ముంబాయి పోలీసుల అదుపులో ఇద్దరు కరీంనగర్ వాసులు

-సైబర్‌క్రైం కేసులో అదుపులోకి

కరీంనగర్ క్రైం, జూలై 11: సైబర్ క్రైం కేసులో ప్రమేయం ఉందన్న కారణంగా ముంబాయి ఈస్ట్ రీజియన్ సైబర్ పోలీసులు గురువారం కరీంనగర్‌లో పలు చోట్ల సోదాలు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ముంబాయి ఈస్ట్ రీజియన్ సైబర్ వింగ్‌కు చెందిన ఓ ఇన్‌స్పెక్టర్ మరో నలుగురు పోలీసు సిబ్బందితో కూడిన బృందం గురువారం మధ్యాహ్నం కరీంనగర్‌కు చేరుకుని సుభాష్‌నగర్‌కు చెందిన ఫరూక్ అహ్మద్, ఆదర్శనగర్‌కు చెందిన వీరనాథ్‌ను అదుపులోకి కరీంనగర్ మూడో ఠాణాకు తరలించి విచారిస్తున్నట్లు తెలిసింది. మరో నిందితుడు అసీముద్దీన్‌తోపాటు మరో మహిళ పరారీలో ఉన్నట్లు సమాచారం. అతని కోసం ముంబాయి, స్థానిక పోలీసు టీం గాలిస్తున్నది. మార్చి నెలలో ముంబాయిలో బాధితుడి ఫిర్యాదుతో నమోదైన సైబర్ క్రైం కేసులో కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ బ్యాంక్‌లో మందాని ఇంపాడ్ పూర్ వెల్ఫేర్ ట్రస్ట్ సంస్థ పేరిట సెక్రెటరీ, ట్రెజరర్, సభ్యులు మొత్తం ఏడుగురి పేరిట జాయింట్ బ్యాంక్ ఖాతా తెరిచారు. ఈ ఖాతాలోకి సైబర్ క్రైంకు సంబంధించిన డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ముంబాయి సైబర్ పోలీసులు గుర్తించి, నిందితులను విచారించేందుకు ఇక్కడికి వచ్చినట్లు సమాచారం. అంతర్జాతీ సైబర్ నేరగాళ్లతో కరీంనగర్‌వాసులకు ఉన్న సంబంధం, బ్యాంక్ లావాదేవీలపై విచారణ జరుపుతున్నారు.

తల్లిదండ్రులను నిర్లక్ష్యానికి గురిచేస్తే చర్యలు

వేములవాడ కల్చరల్, జూలై 11 : వృద్ధాప్యంలో భరోసాగా ఉండాల్సిన సంతానం తల్లిదండ్రులను నిర్లక్ష్యానికి గురి చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కమిషనర్ డిజేబుల్ వెల్ఫేర్, వెల్ఫేర్ ఆఫ్ సీనియర్ సిటిజన్ అండ్ ట్రాన్స్‌జండర్ పర్సన్స్ శైలజ అన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి వచ్చిన ఆమెకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, పీఆర్వో సిరిగిరి శ్రీరాములు పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారి ప్రత్యేకపూజలో పాల్గొనగా ఆలయ నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం అందించి ఆలయాధికారులు స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం ఆలయ గెస్ట్‌హౌస్‌లో శైలజ మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎన్నో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చిందన్నారు. వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే టోల్ ఫ్రీ నంబర్ 14567 కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. సంబంధిత అధికారులను నేరుగా ఇంటికి పంపించి క్షేత్రస్థాయిలో పరిశీలించి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. అన్యాయం వయో వృద్ధుల ఆస్తిని వారసులు అనుభవిస్తూ వారిని నిర్లక్ష్యం చేసినట్లయితే అట్టి ఆస్తిని తిరిగి స్వాధీనం పరుచుకుని తిరిగి వయోవృద్ధులకు అందిస్తామని వివరించారు. జిల్లాలో వయోవృద్ధులు టోల్ ఫ్రీ నంబర్‌ను వినియెగించుకోవాలని 24 గంటలు అందబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి పీ లక్ష్మీరాజం, ఫీల్డ్ రెస్పాన్స్, చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ అధికారులు ఉన్నారు.



స్వామి వారి శేషవస్త్రాలను అందజేస్తున్న ఆలయాధికారులు

మానేరు డ్యాంలో నీటమునిగి గొర్రెలు మృతి

● కుక్కలనుంచి తప్పించుకునేందుకు నీటిలోకి దూకిన మూగజీవాలు

గన్నేరువరం, జులై 11: మానేరు డ్యాంలో నీట మునిగి పలు గొర్రెలు మృతి చెందాయి. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు మద్రి తిరుపతి, పేరం ముత్తయ్య, మడికంటి అశోక్‌కు చెందిన గొర్రెలను మేత కోసం గ్రామశివారులోని మానేరు డ్యాం పరిసర ప్రాంతంలో మేపడానికి గొర్లను తీసుకెళ్లారు. మధ్యాహ్న సమయంలో కాపరులు భోజనం చేస్తుండగా గుంపుగా వచ్చిన కుక్కలు ఒక్కసారిగా గొర్రెల మందపై దాడి చేశాయి. దీంతో కుక్కల భయానికి గొర్రెలు అన్నీ నీటిలోకి దూకగా సుమారు 30 గొర్లు నీటిలో గల్లంతు కాగా 70 గొర్లను అక్కడే ఉన్న మత్స్యకారులు రక్షించారు. నీటిలో మునిగిన గొర్లలో మృతి చెందిన ఆరు గొర్రెల మృతదేహాలు లభ్యం కాగా మిగతా వాటి జాడ తెలియలేదు. తమకు జీవనాధారమైన మూగజీవాలను కోల్పోయామని ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని బాధిత గొర్రెల కాపరులు వేడుకుంటున్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గాయాలు

మల్యాల, జూలై 11: తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశత్తూ జారి పడడంతో గీతకార్మికుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. మండలంలోని మల్యాలకు చెందిన కాసారం ఆంజనేయులుగౌడ్ గురువారం కల్లు కోసం తాటి చెట్టు ఎక్కి కిందకు వస్తుండగా ప్రమాదవశత్తూ జారి కింద పడ్డాడు. దీంతో ఆంజనేయులుకు ఛాతిలో, నడుముకు తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

సీఐగా బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్ కుమార్

జ్యోతినగర్, జూలై 11: రామగుండం సీఐగా టి ప్రవీణ్ కుమార్‌ను నియమించారు. రామగుండంలో పనిచేసిన సీఐ అజయ్‌బాబును మల్టీజోన్ 2 ఐజీకి అటాచ్ చేశారు. ఈ మేరకు ప్రవీణ్‌కుమార్ గురువారం రామగుండం సీఐగా బాధ్యతలు తీసుకున్నారు.

టూటౌన్ సీఐగా ప్రసాదరావు..

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 11: గోదావరిఖని టూటౌన్ సీఐగా ఎన్ ప్రసాదరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు టూటౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాదరావు, ఎన్నికల కోడ్ రావడంతో ట్రాన్స్‌ఫర్ అయ్యారు. గురువారం జరిగిన బదిలీల్లో తిరిగి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నూతన నాయబ్ తహసీల్దార్‌గా మానస

రామగిరి, జూలై 11: మండల నాయబ్ తహసీల్దార్‌గా యజ్ఞంబట్ల మానస గురువారం బాధ్యతలు చేపట్టారు. మంథని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో పనిచేసి సాధారణ బదిలీల్లో భాగంగా తహసీల్దార్ రాంచందర్‌రావు సమక్షంలో విధుల్లో చేరారు.

వరినాట్లు ఆలస్యమైతే చీడపీడల ముప్పు

రామగిరి, జూలై 11: వరినాట్లు ఆలస్యమైతే చీడపీడల ముప్పు పొంచి ఉంటుందని ఏవో బండి ప్రమోద్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని లొంకకేసారంతోపాటు పలు గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. జూన్ 20 నుంచి జూలై 15లోగా వరినాట్లు పూర్తిచేసుకోవాలని రైతులకు సూచించారు. వరినార్లు ఆలస్యమైనట్లయితే చీడపీడలు ఆశ్రయించే అవకాశాలుంటాయని పేర్కొన్నారు. రైతులు అనవసరంగా రసాయన మందులు వాడటం వల్ల భూసారం తగ్గుతుందని, వీలైనంత మేర సేంద్రియ ఎరువులు మాత్రమే వాడాలని రైతులకు సూచించారు.

అధికారులపై చర్యలు తీసుకోండి

కోల్‌సిటీ, జూలై 11: రామగుండం నగరపాలక సంస్థలో శానిటేషన్ ట్రాక్టర్ల టెండర్లలో కాంట్రాక్టర్లకు అనుకూలంగా టెండర్ నిబంధనలు పొందుపరిచారని,ఇలా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని నగరపాలక కాంట్రాక్టర్లు విశ్వతేజ గురువారం కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో వాటర్ ట్యాంకర్ టెండర్లలో జీపీఎస్, ఫిట్‌నెట్, ఆర్‌సీ, ఇన్సూరెన్స్‌లు అడిగారని, ఈసారి ఇలాంటి డాక్యుమెంట్లు అడగకుండానే టెండర్ పిలిచారన్నారు. ఇలా నిబంధనలు మార్చడం వల్ల తమకు అనుకూలమైన కాంట్రాక్టర్లకు టెండరు వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నారని, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

కొలనూర్ హైస్కూల్‌లో వనమహోత్సవం

ఓదెల, జూలై 11: మండలంలోని కొలనూర్ హైస్కూల్లో గురువారం ఉపాధ్యాయులు వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల మైదానంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కొలనూరులో బీరన్న వేడుకలు

ఓదెల, జూలై 11: మండలంలోని కొలనూరులో గురువారం కుర్మ కులస్తుల ఇలవేలుపు దైవమైన బీరన్న స్వామి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంగ రాజయ్య, గోవిందుల ఐలయ్య, గోవిందుల కొమురయ్య, జీగురు చంద్రయ్య, జీగురు రవిందర్ పాల్గొన్నారు.

'అసత్య ఆరోపణలు చేస్తే సహించం'

మంథని, జూలై 11: మంథని నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసం శ్రమిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబులపై మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అసత్య ఆరోపణలు చేస్తే సహించిలేదని కాంగ్రెస్ నేతలు అయిలి ప్రసాద్, ఎరుకల ప్రవీణ్, ఆర్ల నాగరాలు వెల్లడించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. తమ నాయకులపై మధు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. అసత్యపు ఆరోపణలు చేస్తే ఇంటిని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఉదరి శంకర్, నాగుల రాజయ్య, కొమ్ము సమ్మయ్య, ఆరెల్లి కిరణ్, జనగామ సడవలి, రాంపెల్లి సమ్మయ్యలు పాల్గొన్నారు.

'కృతజ్ఞత శుభాకృతి'ని విజయవంతం చేయండి

మంథని, జూలై 11: మంథని విద్యార్థి యువత సంస్థను స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఈ నెల 15న ఫ్రెండ్స్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన కృతజ్ఞత శుభాకృతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కొండేల మారుతి కోరారు. గురువారం ఆయన విలేకరుల మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను లాభాపేక్ష లేకుండా నిర్వహించామన్నారు. 15న జరిగే కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. చంద్రుపట్ల సుధాకర్‌రెడ్డి, తాటి బుచ్చన్నగౌడ్, సర్వ చిన్నబాబు, రామడుగు మారుతిలు పాల్గొన్నారు.

ఎల్లో, రెడ్ కార్డ్ విధానం నిలిపి వేయాలి...

గోదావరిఖని, జూలై 11: ప్రాణాలు పణంగా పెట్టి పని చేస్తున్న ఉద్యోగులను క్రీడాకారులుగా, బొగ్గు గని పనులను క్రీడా పోటీలుగా చూస్తున్న సింగరేణి యాజమాన్యం దుర్మార్గమైన ఆలోచనలను ఖండిస్తున్నట్టు టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. బొగ్గు గనుల్లో యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా రక్షణ చర్యలను విస్మరించి అధిక ఉత్పత్తి కోసం ఉద్యోగులతో పనులు చేయిస్తున్నదని వారు ఆరోపించారు. వెంటనే యాజమాన్యం ఎల్లో, రెడ్ కార్డ్ సర్క్యులర్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చర్యలు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రతివారం స్కూల్ కాంప్లెక్సు పరిధిలోని పాఠశాలలను తనిఖీచేయాలని, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో పాఠశాల విద్యపై కాంప్లెక్స్ హెడ్ మాస్టర్‌లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంప్లెక్స్ పరిధిలోని పాఠశాలలో చదివే విద్యార్థుల పట్ల హెడ్ మాస్టర్‌లకు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ప్రతి వారం కాంప్లెక్స్ పరిధిలో కనీసం 3 పాఠశాలలను తనిఖీచేయాలని సూచించారు. పాఠశాల తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో కాంప్లెక్స్ హెడ్ మాస్టర్‌లు పాఠశాలలో కనీసం హఫ్ డే ఉండాలని, పాఠ్యాంశాల బోధన వినాలని, పాఠశాలకు మంచి ఉపయోగకరమైన ఫీడ్ బ్యాక్ అందించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు రెగ్యులర్‌గా హాజరుకావాలని, హాజరు తక్కువ ఉన్న విద్యార్థులపై శ్రద్ధ వహించి వారి ఇంటికి వెళ్లి ఫాలోఅప్ చేసే విధంగా చూడాలన్నారు. పాఠశాలలకు ఉపాధ్యాయులు సకాలంలో చేరుకునేలా సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠ్యాంశాన్ని విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే విధంగా బోధించాలని, దీనికి అనుసరించాల్సిన విధానం గురించి ఉపాధ్యాయులకు అవసరమైన సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు అందించాలన్నారు. పిల్లలకు మంచి అలవాట్లు, వ్యక్తిత్వం పెంపొందించే విధంగా నీతి కథలు, మోరల్ స్టడీస్ బోధించాలని, విద్యార్థుల ప్రమాణాలు పెరిగేలా చూడాలన్నారు. విద్యా సంవత్సరం ముగిసే నాటికి మన పాఠశాలలో ఉన్న విద్యార్థుల్లో కనీసం 90 శాతం మంది విద్యార్థులు విద్యా ప్రమాణాలను సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. ప్రతినెల 3వ తేదీన కాంప్లెక్స్ పరిధిలో ఉన్న పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయు లతో రివ్యూ సమావేశం ఏర్పాటు చేసి విద్యా ప్రమాణాల పురోగతిపై చర్చించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జిల్లా అకడమిక్ అధికారి పీఎం షేక్, కాంప్లెక్స్ హెడ్ మాస్టర్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారం

గేట్ మీటింగ్‌లో జేఏసీ నాయకులు



ప్రసంగిస్తున్న ఐఎన్‌టీయూసీ నేత బాబర్ సలీంపాషా

జ్యోతినగర్, జూలై 11 : కార్మిక సంఘాలు ఐకమత్యంతో ఎన్టీపీసీ యాజమాన్యంపై పోరాడితేనే కార్మిక సమస్యలు పరిష్కారం అవుతాయని జేఏసీ నాయకులు బాబర్ సలీంపాషా (ఐఎన్‌టీయూసీ), కౌశిక హరి (బీఆర్ఎస్) స్పష్టం చేశారు. యూనియన్లు చేసే ఉద్యమంలో కార్మికులు స్వచ్ఛందంగా భాగస్వాములవ్వాలని వారు కోరారు. గురువారం ఎన్టీపీసీ ప్లాంటు వద్ద జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో నాయకులు ప్రసంగించారు. యూనియన్లలో ఉన్న అనైక్యతను ఆసరా చేసుకొని యాజమాన్యం తమ డిమాండ్లను పట్టించుకోవడం లేదన్నారు. గతంలో కార్మిక శాఖ సమక్షంలో చట్టబద్ధంగా కుదుర్చుకున్న ఒప్పందాన్ని సైతం ఎన్టీపీసీ యాజమాన్యం అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఒప్పందం ప్రకారం సీనియర్ కార్మికులు, ఐటీఐ ఉన్న కార్మికులకు పదోన్నతులు కల్పించాల్సి ఉండగా కొంతమందికి ఇచ్చి చేతులు దులుపుకుంటున్నదన్నారు. డిపెండెంట్ కార్మికులకు పూర్తిస్థాయి అలవెన్సులు చెల్లించాలని, గతంలో ఉన్న విధంగానే ఏడాదిపాటు పని చేసే విధంగా గేట్‌పాస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒప్పందంలో ఉన్న ప్రతి అంశాన్ని ఎన్టీపీసీ యాజమాన్యం అమలుచేయాలని, వచ్చే ఆదివారం జేఏసీ జనరల్‌బాడీ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మిక సంఘాలకు గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని కౌశిక హరి పేర్కొన్నారు. జేఏసీ నాయకులు చిలుక శంకర్, నాంసాని శంకర్, ఇజ్జగిరి భూమయ్య, ఏ.శ్రీనివాస్, గీట్ల లక్ష్మారెడ్డి, భూమల్ల చందర్, రాజమల్లయ్య, నాగభూషణం, బుచ్చయ్య, శ్రీనివాస్, లక్ష్మణ్, కార్మికులు పాల్గొన్నారు.

14న మోటార్‌వర్కర్స్ యూనియన్ మహాసభలు



సమావేశంలో మాట్లాడుతున్న ఇ.నరేష్

జ్యోతినగర్, జూలై 11: ఎన్టీపీసీలో ఈనెల 14న జరిగే మోటార్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టియు) 3వ జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామని, మోటార్ రంగ కార్మికులు మహాసభను విజయవంతం చేయాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఇ.నరేష్ పేర్కొన్నారు. గురువారం ఎన్టీపీసీ ఐఎఫ్‌టీయూ ఆఫీసులో మోటార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షల మంది మోటార్ రంగంలో కార్మికులుగా పని చేస్తున్నారన్నారని, ఆటో, మోటార్ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం మోటార్‌రంగ కార్మికుల మేలు కోసం ప్రయత్నించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మోటార్‌రంగ కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటుచేయాలని కోరారు. కేంద్రంలోని మోదీ సర్కారు మోటార్‌వెహికిల్ 2019 చట్టాన్ని తెచ్చి కార్మికులను మరింత ఇబ్బందులకు గురి చేసిందన్నారు. రాష్ట్ర, జాతీయ, స్థానిక స్థాయి వివిధ సమస్యలపై 14న జరిగే మహాసభలో చర్చించి పోరాట కార్యక్రమాలను రూపొందిస్తామని నరేష్ తెలిపారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టియు, దాని అనుబంధ సంఘాల నాయకులు చిలుక శంకర్, ఎం.కొమరయ్య, రవికుమార్, ముళీ, సలీం, ఫజల్, అజీం, బాలకృష్ణ, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



ఖనిలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



నందిమేడారంలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కోల్‌సిటీ, జూలై 11: సిద్దిపేటలో న్యాయవాది ఎం రవికుమార్‌పై అక్కడి ఏఎస్‌ఐ ఉమారెడ్డి దాడి చేయడాన్ని నిరసిస్తూ గోదావరిఖని న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు. ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు నిర్వహించిన ఈ బందుతో గోదావరిఖనిలోని అదనపు జిల్లా న్యాయస్థానం, సబ్‌కోర్టు, మున్సిఫ్‌కోర్టు కాంప్లెక్స్‌లోని అన్ని కోర్టుల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. అనంతరం మున్సిఫ్ కోర్టు కాంప్లెక్స్ ఎదుట అఖిల భారత న్యాయ వాదుల సంఘం(ఐలు) ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. న్యాయవాదిపై దాడికి పాల్పడిన ఏఎస్‌ఐ ఉమారెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐలు జాతీయ కౌన్సిల్ సభ్యురాలు చందాల శైలజ, బాధ్యులు గోసిక ప్రకాష్, ఎరుకల ప్రదీప్ కుమార్, షహనవాజ్, న్యాయవాదులు పుర్మ శ్రీనివాస్, గుడికందుల భూమయ్య, సానం మురళి, చెలికల శ్రీనివాస్‌తో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ధర్మారం, జూలై 11:సిద్దిపేట బార్ అసోసియేషన్ సభ్యుడు రవికుమార్‌పై అక్కడి పోలీసులు దాడి చేసిన సంఘటనను నిరసిస్తూ గురవారం ధర్మారం మండలం నందిమేడారం సివిల్‌కోర్టులో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నార అశోక్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి అకారి రాజేశం, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సంయుక్త కార్యదర్శి బోట్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు

సుల్తానాబాద్, జూలై 11: ముదిరాజ్ కులస్తుల ఆరాధ్య దైవమైన పెద్దమ్మ తల్లి బోనాల వేడుకలను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన ముదిరాజ్ కుటుంబాలు సాయంత్రం బోనాల వేడుకలను ఊరేగింపుగా జరుపుకున్నారు. ఆలయం వద్ద పెద్దమ్మ తల్లికి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించకున్నారు. వేడుకలను పురస్కరించుకొని పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో పలువురు నాయకులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

పాలకుర్తి, జూలై 11: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి అన్నారు. గురువారం స్థానిక యూనివర్సల్ పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎస్ఐ మాట్లాడారు. మద్యపానం, గంజాయిలాంటి వ్యసనాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల కరస్పాండెంట్ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోషల్ ఎకనామిక్ సర్వే సమీక్ష

రామగిరి, జూలై 11: మండలంలోని పెద్దంపేట్ గ్రామంలో సోషల్ ఎకానమిక్ సర్వేపై గురువారం ఆర్డీవో హనుమానాయక్ రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సింగరేణి విస్తరణలో బాగంగా మిగిలి ఉన్న గృహాలకు సంబంధించిన పరిహారంపై ప్రధానంగా చర్చించారు. పనులు సత్వరం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మండలంలో నెలకొన్న ధరణి సమస్యలను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాంచందర్‌రావు, డీటీ మానస, రెవెన్యూ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ

ఎలిగేడు, జూలై 11 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కుటుంబ నియంత్రణ, అధిక జనాభా నియంత్రణపై అవగాహన స్లోగన్స్ చేశారు. ఈ కార్యక్రమం డాక్టర్లు నిస్క్రిష్టాన, కేశవరెడ్డి, సీహెచ్‌వో విజేందర్‌రాజు, హెల్త్‌సూపర్‌వైజర్ లక్ష్మణ్, రాజేశ్వరి, నాగరాణి, జీపీ కార్యదర్శి సౌమ్య, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఎల్ఐసీ సేవలు

పెద్దపల్లిటౌన్, జూలై 11: ప్రజలకు అందుబాటులో ఎల్ఐసి సేవలు అందిస్తున్నట్లు పెద్దపల్లి ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ ప్రేమ్ సాగర్ రెడ్డి తెలిపారు. పెద్దపల్లి పట్టణం శ్రీచైతన్య కాలనీ చీకురాయి రోడ్డు నెంబర్ 2 లో దీక్ష అకాడమీ ఐఐటీ నీట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎల్ఐసి పాలసీదారుల సేవా కేంద్రాన్ని గురువారం బ్రాంచ్ మేనేజర్ ప్రేమ్ సాగర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ప్రేమ్ సాగర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ఐసి పాలసీదారుల కోసం నిరంతరం కొత్త విధానాలతో పాలసీదారులకు అనుకూలంగా సేవలను అందిస్తూ ఇంటి వద్దకే డిజిటల్ సర్వీస్ విధానాన్ని ప్రోత్సహిస్తుందని అన్నారు. ఇలాంటి అవకాశాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబిఎం అచ్యుతరావు, కౌన్సిలర్ ఎరుకల కల్పన రమేష్, సీనియర్ డెవలప్ మెంట్ అధికారి రాజశేఖర్, నిర్వాహకుడు కాసారపు అశోక్, ఎల్ఐసి ఏజెంట్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిటౌన్, జూలై 11: ఇండియన్ ఎయిర్‌పోర్స్ అగ్నివీర్ వాయు రిక్రూట్‌మెంట్ ఎంపిక పరీక్షకు జూలై 28లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అవి వాహిత భారతీయ స్త్రీ, పురుషుల కోసం అగ్నివీర్ వాయు రిజిస్ట్రేషన్ ఆధారిత రిక్రూట్‌మెంట్ ఎంపిక పరీక్ష నిర్వహిస్తుందన్నారు. అభ్యర్థులు 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3 మధ్యలో జన్మించి ఉండాలని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు జూలై 28 రాత్రి 11 గంటల లోగా అగ్నీపథ్‌యయూ. సీడీఏసీ. ఇన్ అనే వెబ్ పోర్టల్ నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రిక్రూట్మెంట్ ఎంపిక పరీక్షకు సంబంధించి విద్యార్హతలు, వైద్య ప్రమాణాలు, ఇతర పూర్తి వివరాల కోసం వెబ్ సైట్ ను సందర్శించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి



మాట్లాడుతున్న ఎంఈవో రాజయ్య

కోల్‌సిటీటౌన్, జూలై 11: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతం పెంచాలని రామగుండం మండల విద్యాధికారి ఆరెపల్లి రాజయ్య అన్నారు. గురువారం గోదావరిఖని గాంధీపార్కు ప్రాథమిక పాఠశాలలో రామగుండం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ లిట్రసి న్యూమరిక్(ఎఫ్ఎల్ఎన్) పద్ధతి ఆధారంగా పరీక్ష నిర్వహించి ప్రగతిని నమోదు చేయాలని తెలిపారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చరవాణిని ఉపయోగించరాదని, విద్యార్థులచే వర్క్‌బుక్‌లోని కృత్యాలను చేయించాలన్నారు. అదేవిధంగా అన్ని పాఠశాలల్లో వనమహోత్సవ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో మండల నోడల్ అధికారి గడ్డం చంద్రయ్య, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు భవాని, జయరాజ్, స్వర్ణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.రాంబాబు, రిసోర్స్ పర్సన్ రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జనాభా పెరుగుదల మానవాళికి నష్టం

కాల్వశ్రీరాంపూర్, జూలై 11: జనాభా పెరుగుదలతో మానవాళికి నష్టమని డాక్టర్ భావన అన్నారు. గురువారం మండలంలోని కూనారం గ్రామంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జనాభా పెరుగుదల గురించి గ్రామస్థులతో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ భావన మాట్లాడుతూ జనాభా తక్కువ ఉన్న దేశాలు ఎక్కువ అభివృద్ధిలో ఉంటాయని, జనాభా ఎక్కువగా ఉన్న దేశాలు అభివృద్ధి తక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య విస్తరణ అధికారి ఆరెల్లి లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, ఏఎన్ఎం కవిత, ఆరోగ్య సిబ్బంది ఆశాలు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలు

అంతర్గాం, జూలై 11: రామగుండం పట్టణంలోని తబితా అనాథ ఆశ్రమంలో గురువారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకలను రామగుండం బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసిన అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆశ్రమంలోని అనాథ పిల్లలకు నూతన వస్త్రాలు అందజేశారు. ఆశ్రమంలో గేటు, టాయిలెట్స్ నిర్మాణానికి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మేరుగు హన్మంతుగౌడ్, గాండ్ల ధర్మపురి, మిట్టపల్లి సతీష్, బాణాల స్వామి, గుండబోయిన భూమన్న, రమేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పట్టణ అభివృద్ధికి అందరూ సహకరించాలి



మొక్కలు నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిటౌన్, జూలై 11: పట్టణ అభివృద్ధికి అందరూ సహకరించాలని శాసనసభ్యుడు చింతకుంట విజయరమణారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని 8, 9 వ వార్డుల్లో శుక్రవారం స్థానిక కౌన్సిలర్లు బొంకూరి బాగ్యలక్ష్మీ సురేందర్ సన్నీ, ఎరుకల కల్పన రమేష్‌లతో సందర్శన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వార్డులను పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్లు, కాలువల్లో చెత్త వేయరాదని సూచించారు. డ్రైనేజీ, ఓపెన్ ప్లాట్లలోని చెత్తను ఎప్పటికప్పుడు తీసి వేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. ఈ వార్డులలో రోడ్లు వేయించడంతో పాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు అతి త్వరలో నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. అనంతరం వార్డుల్లో నిర్వహించిన వన మహోత్సవంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, ఎ.ఈ సతీష్, మున్సిపల్ మేనేజర్ శివ ప్రసాద్, పట్టణ కౌన్సిలర్లు, ప్రభుత్వ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, విద్యుత్ శాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలి



నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న ఏసీపీ రమేష్

మంథని, జూలై 11: విద్యార్థులు చదువులో రాణించి జీవితంలో ఉన్నతంగా ఎదిగి సమాజ సేవ చేయాలని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ సూచించారు. స్థానిక సీతారామ సేవా సదన్ ఆధ్వర్యంలో మండలలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుల్లో ప్రతిభను చాటుతున్న విద్యార్థులకు ఏసీపీ రమేష్ స్కాలర్‌షిప్స్, నోట్ బుక్కులను గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ కన్నవారి కలలను నెరవేర్చటానికి విద్యకు మించిన ఆయుధం మరొకటి లేదన్నారు. ఈవిషయాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థి దశలోనే తమ భవిష్యత్ లక్ష్యాన్ని పెట్టుకొని క్రమశిక్షణతో దాన్ని సాధించేంత వరకు విశ్రమించకుండా శ్రమించాలన్నారు. ఈకార్యక్రమంలో సీతారామ సేవా సదన్ నిర్వాహకులు కేవీఎల్ఎన్ హరిబాబు, దుద్దిళ్ల గణపతిలు పాల్గొన్నారు.



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత

రామగిరి, జూలై 11: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లో 14 డిపెండెంట్లకు గురువారం కారుణ్యనియామక పత్రాలను అందజేశారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వివిధ విభాగాల్లో పనిచేసి మెడికల్ ఇన్వాలిడేషన్, మృతిచెందిన డిపెండెంట్లకు ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు ముప్పిడి రవీందర్‌రెడ్డి, గుర్రంశ్రీహరి, క్రాంతి కిరణ్, ట్రేడ్ యూనియన్ నాయకులు జూపాక రాంచందర్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 11: బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ తలపెట్టిన ఆందోళనల్లో భాగంగా నాలుగవరోజైన గురువారం ఆర్జీ-2 ఏరియా జీఎం ఆఫీస్ ఎదుట యూనియన్ శ్రేణులు రిలే నిరాహార దీక్ష చేశాయి. రాష్ట్రంలోని గనులు వేలం వేయకుండా ఉద్యమించాల్సిన అవసరం ఉన్నదని, కార్మిక వర్గం ఆందోళనలకు కలసి రావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈనిరహార దీక్ష లో ప్రకాష్, గౌతంగోవర్ధన్, రాజారత్నం, శ్యాంసన్, రాజసాగర్, నర్సయ్య, సాంబశివరావుతో పాటు వివిధ గనులకు చెందిన యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బీఎంఎస్ పోస్టర్ ఆవిష్కరణ

రామగిరి, జూలై 11: శ్రీరాంపూర్‌లో ఈనెల 14న జరిగే బీఎంఎస్ 28న ద్వైవార్షిక మహాసభ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2లో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ముఖ్య అతిథిగా హాజరై పోస్టర్ ఆవిష్కరించారు. మహాసభకు అయ్యే ఖర్చు కోసం బీఎంఎస్ నాయకుడు మామిడి స్వామి తన వంతుగా రూ.5వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అరుకాల ప్రసాద్, రౌతు రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు చేయాలి

డీఎంఎస్ (మైనింగ్) నాగేశ్వరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

యైటింక్లయిన్‌కాలనీ, జూలై 11: పనిస్థలాల్లో సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అమలు చేయాలని, తద్వారా ప్రమాదాలను నియంత్రించవచ్చని డీఎంఎస్(మైనింగ్) నాగేశ్వరరావు పేర్కొన్నారు. సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఆవశ్యకత, అమలుపై సింగరేణి సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఒక రోజు వర్క్‌షాప్ కార్యక్రమం ఎన్‌సీఓఏ క్లబ్‌లో జరిగింది. ఈసందర్భంగా డీఎంఎస్ నాగేశ్వరరావు మాట్లాడారు. సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ అనుసరించి గనులు, డిపార్‌మెంట్ల వారిగా భద్రతా సూత్రాలను పాటిస్తూ పని చేయాలని, బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతతో మన సేఫ్టీ, మన బాధ్యత అని, మనతోపాటు తోటి కార్మికుల రక్షణపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో కార్మిక సంఘాలు, అధికారులతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డీడీఎంఎస్ బానోతు వెంకన్న మాట్లాడుతూ పని ప్రదేశాల్లో చట్ట ప్రకారం తీసుకోవాల్సిన భద్రతా, ఆరోగ్య, సంక్షేమపరమైన చర్యలపై అవగాహన కల్పించాలని, తద్వార ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలను తీసుకోవాలన్నారు. ఈసందర్భంగా అన్ని ఏరియా సేఫ్టీ అధికారులు ఏరియాల వారిగా జరిగిన ప్రమాదాలు, సేఫ్టీ మేనేజ్‌మెంట్ ప్లాన్ ఆవశ్యకతలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. జీఎం సూర్యనారాయణ, సేఫ్టీ జీఎం గురువయ్య, జీఎం వెంకటేశ్వరరావు, రామగుండం రీజియన్, భూపాలపల్లి ఏరియాలకు చెందిన జీఎంలు, సేఫ్టీ ఆఫీసర్లు, గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అడ్రియాల గనిని సందర్శించిన డీఎంఎస్



ప్రాజెక్టును పరిశీలిస్తున్న డీఎంఎస్ నాగేశ్వర్‌రావు

రామగిరి, జూలై 11: సింగరేణి అడ్రియా ప్రాజెక్టును గురువారం సౌత్ సెంట్రల్ జోన్, హైదరాబాద్ రీజియన్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(మైనింగ్) ఎం నాగేశ్వరరావు, డీడీఎంఎస్ (మైనింగ్) బీ వెంకన్న సందర్శించారు. ఈ సందర్భంగా గనిలోని 1వ సీమ్ ప్యానల్-3లో చేస్తున్న సాల్వేజింగ్ పనులు, తీసుకుంటున్న భద్రత చర్యలపై సమీక్ష నిర్వహించి వివరాలను తెలుసుకున్నారు. ముందుగా వారికి ఏపీఏ జీఎం కే వెంకటేశ్వర్లు, పీఓ కే నాగేశ్వరరావు భద్రతాపరంగా తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. అనంతరం 3వ సీమ్ పంచ్ ఎంట్రీని సందర్శించి అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించాలని, అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ, భద్రతతో విధులు నిర్వహించాలని, అందుకు అనుగుణంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు.

వారితో పాటు ఏరియా ఇంజనీర్ బీ సీతారామం, ప్రాజెక్ట్ ఇంజనీర్ టీ రఘురాం, ఎస్ఓఎం కే జనార్ధన్, భద్రతాధికారి ఎం రమేష్‌తో పాటు ఇతర అధికారులు ఉన్నారు.